

అశోక్‌కాలనీలో అభయహస్తం కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా

కాంగ్రెస్ ఆరు హామీలు చరిత్రాత్మకం

సనత్‌నగర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలు చరిత్రలో నిలిచిపోతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. సనత్ నగర్ డివిజన్ అశోక్‌కాలనీలో ఇంటింటికీ అభయహస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట నీలిమా మాట్లాడుతూ... మహిళలు ఆత్మాభిమానంతో బతకాలని, వారికి అనేక పథకాల అమలుపై కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పాలనలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. ఇంటింటికీ అభయహస్తం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు ఇబ్రహీం పటేల్, బబ్లు, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.





'సంక్షేమం'లో తెలంగాణ దేశానికే ఆదర్శం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను దేశంలోని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద 72 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ల కింద ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సొంత ఇల్లు లేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఉచితంగా ఇస్తూ సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నట్లు వివరించారు. కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎస్.శేషుకుమారి, ఆకుల రూప, అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా లోపభూయిష్టం

- ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు
- మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: రాష్ట్ర ఓటర్ల తుది జాబితా లోపభూయిష్టంగా ఉందంటూ సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఓటరు జాబితాలో జరిగిన లోపాలను వివరిస్తూ గురువారం ఆయన కమిషనర్‌కు ఈ-మెయిల్ పంపించారు. సనత్‌నగర్ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ నెంబర్ 211 పరిధిలో ఒకే అంతస్తులో ఉన్న ఎస్ఆర్‌టీ 765 ఇంట్లో 26 మంది ఓటర్లు ఉండడంపై తాను బీఎల్ఓ, ఈఆర్వో దృష్టికి తీసుకురావడం జరిగిందని ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి ప్రస్తావించారు. ఆ తర్వాత 26 మంది ఓటర్లలో తొమ్మిది మందిని ఆ ఇంట్లోనే ఓటర్లుగా ఉంచగా, మిగతా 17 మందిని నియోజకవర్గ పరిధిలోని ఇతర పోలింగ్ కేంద్రాలకు ఓటు హక్కును బదిలీ చేసినట్లు అధికారులు చెప్పారని వివరించారు. అయితే సదరు ఓటర్ల గురించి పోలింగ్ స్టేషన్ల వారీగా సమాచారాన్ని కోరగా ఇంతవరకు అందించలేదన్నారు. తదుపరి జరిగిన సమావేశంలో ఇదే విషయమై తాను ప్రశ్నించగా ఫారం-8 ఆధారంగా మార్పు చేసినట్లు ఈఆర్ఓ పేర్కొన్నట్లు తెలిపారు. అయితే సదరు ఫారాలను చూపించాల్సిందిగా అధికారులను అభ్యర్థించినప్పటికీ వారి వద్ద అందుబాటులో లేవని చెప్పారని వివరించారు. తుది జాబితాను పరిశీలించగా 211 పోలింగ్ బూత్ ఓటర్లకు సంబంధించి ఎలాంటి మార్పులు లేకుండా యథావిధిగా ఉండడం ఆశ్చర్యం కలిగిందన్నారు. సీఈఓ, యంత్రాంగం పనితీరును ఎన్నికల కమిషనర్ తీవ్రంగా పరిగణించాలన్నారు.







కంటోన్మెంట్‌లో 1,203 మందికి 'డబుల్' ఇళ్లు



లాస్య నందితను కలిసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వాసులకు రికార్డు స్థాయిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కాయని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి జి.లాస్య నందిత అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి దుండిగల్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 1,205 మంది లబ్ధిదారులకు గురువారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు లాస్య నందితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సహకారంతోనే తాము డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నామని, తాజాగా ఆన్‌లైన్ డ్రాలో ఇళ్లు దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం లాస్య నందిత మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ పాటికే సుమారు వెయ్యి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి లబ్దదారులకు అందజేయడం జరిగిందన్నారు. తాజాగా ఆన్‌లైన్ ద్వారా మొత్తం 1,703 మంది కంటోన్మెంట్ వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కాయన్నారు. తొలి విడతలో 200 మందికి, రెండో విడతలో 300 మందికి ఇళ్లు అందజేసినట్లు తెలిపారు. పేదల పక్షపాతి సీఎం కేసీఆర్ వల్లే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది డబుల్ బెడ్‌రూమ్ అందుకుంటున్నారని తెలిపారు. ఇవే కాకుండా పేదల సంక్షేమాన్ని కాంక్షిస్తూ అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేసీఆర్ వరుసగా మూడోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం బంగారు తెలంగాణ రూపుదిద్దుకోవడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, సీనియర్ నాయకులు నర్సింహ్మ ముదిరాజ్, అజయ్, మురళి యాదవ్, కిరణ్, నరేశ్, గజ్జెల గోపాల్, నారాయణ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎస్ఐఆర్-నీరి ఆధ్వర్యంలో జాతీయ వర్క్‌షాప్

లక్డీకాపూల్ : ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో పర్యావరణ సమస్యలపై దృష్టి సారించడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో వర్క్‌షాప్‌కు నగరం వేదికగా మారింది. సీఎస్ఐఆర్-నీరి హైదరాబాద్ జోనల్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని హోటల్ ది ప్లాజాలో నిర్వహించే ఈ వర్క్‌షాప్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న వివిధ పర్యావరణ సవాళ్లు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు సంబంధించిన పర్యావరణ సమస్యలను పరిష్కరించడానికి సాధ్యమయ్యే పరిష్కారాలను చర్చించనున్నది. ఇందుకు శాస్త్రవేత్తలు, నియంత్రణ అధికారులు, విధాన రూపకర్తలు, పారిశ్రామిక సిబ్బందిని ఒక ప్రత్యేక వేదికపైకి తీసుకురావడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యం. బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి. వెంకట రమణ, టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి శ్రీ కృష్ణ ఆదిత్య దివీస్ లేబొరేటరీస్ మాజీ డైరెక్టర్ దివి మధుసూదనరావు పాల్గొనే ఈ వర్క్‌షాపును సీఎస్ఐఆర్ హైదరాబాద్ జోనల్ సెంటర్ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ షేక్ బాషా ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించనున్నారు.

క్రీడాకారులకు కిట్స్ అందజేత



సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు గురువారం కిట్స్‌ను పంపిణీ చేశారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ క్రీడాకారులకు కిట్స్‌ను అందించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ... ఔత్సాహికులైన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అధికారులు శ్రీనివాస్‌గౌడ్, కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
O.A. No. 61 of 2023
HDFC Bank Ltd., ...Applicant
AND
B. Kasthuri Bai ...Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
B. Kasthuri Bai, W/o. Late Guru Rama Rau, Aged Major, Occ: Housewife, Sri Ram Villa No. 116, Vasudev Villas, Bloom Field Escsasy, Telapur, Hyderabad, Telangana - 502032. Mobile No. 9441257773. ...Defendants
Please take the summons in the above O. A. No. 61 of 2023 filed by the Applicant for Recovery of money of Rs. 26,35,790.92 ps against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Sakshi" Telugu Daily newspaper and posted the matter to 10-11-2023.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 10.11.2023 at 10.30 a.m at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001 in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 3rd of October, 2023.
(By order of the Court)
Asst Registrar
Debts Recovery Tribunal - II
Hyderabad








Happy Birthday
to our beloved leader
Sri Talasani Srinivas Yadav Garu
Minister for Animal Husbandry, Fisheries and Cinematography of Telangana
ABHISHEK PICTURES
Signature GRILLS THE VEG BARBEQUE

8న ఓయూలో ట్రైబల్ డిక్లరేషన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ట్రైబల్ డిక్లరేషన్ వాల్ పోస్టర్‌ను ఆర్ట్స్ కాలేజీ ఎదుట గురువారం ఆవిష్కరించారు. అనంతరం గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ మాట్లాడుతూ... ఈ నెల 8న ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలోని 33 జిల్లాల గిరిజనులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో విజయ్‌నాయక్, రమేష్‌రాథోడ్, మోహన్‌కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 23న మాదిగల యుద్ధభేరి

- విజయవంతం చేయండి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వంగపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ కాశీం

ఉస్మానియా యూనివర్సిటీ: నవంబర్ 23న ఇందిరాపార్క్ వద్ద జరగనున్న మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని టీఎస్–ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. గురువారం ఓయూ దూరవిద్య సెమినార్ హాలులో జరిగిన కార్యక్రమంలో మాదిగల యుద్ధ భేరి కర పత్రాన్ని వంగపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ కాశీం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మాదిగ, మదిగ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయమైన వాటకై పోరాడాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని, వచ్చే ఎన్నికల్లో 23 సీట్లు కేటాయించాలని, డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ. 4000 పింఛన్, ప్రతి కుటుంబానికి దళిత బంధు, ఎస్సీ వర్గీకరణకు కేంద్రంపై ఒత్తిడి, మంత్రి వర్గంలో మాదిగలకు సముచిత స్థానం, రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ యూనివర్సిటీ ఏర్పాటు, పైలెట్ ప్రాజెక్టు కింద మాదిగలకు ఇండ్లు నిర్మించాన్నారు. వర్సిటీలలో బోధన, బోధనేతర ఉద్యోగాలు భర్తీ చేయాలి, ప్రభుత్వ శాఖలలో ఖాళీల భర్తీ, హైదరాబాద్‌ను భాగమతి జిల్లాగా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, నేతలు కొల్లూరి వెంకట్, శ్రీకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

పద్మారావునగర్ పార్కులో అధికారుల పర్యటన

- ఈ నెల 11న పార్కు ప్రారంభానికి సన్నాహాలు



పార్కును సందర్శించిన డీడీ రాజ్‌కుమార్, కార్పొరేటర్ హేమలత

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పార్కును గురువారం జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటర్ సందర్శించారు. జీహెచ్ఎంసీ ఉద్యాన వన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, కార్పొరేటర్ కె.హేమలత, ఇన్‌ఛార్జీ పవన్‌కుమార్ గౌడ్, గణేష్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రణవీర్, నాయకులు శ్రీధర్, క్రిష్ణయాదవ్, ఈసీ రావు, మామిడి బాల్‌రెడ్డి తదితరులు సందర్శించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. వాకర్స్ కోసం చేపడుతున్న పలు పనులను సమీక్షించారు. సందర్శకులు, యోగా సాధనలు, వాకర్స్‌కు పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా పచ్చదనం వెల్లివిరిసేలా ల్యాన్‌లను, యోగా షెడ్డు తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ చెప్పారు. రంగు రంగుల పూల మొక్కలతో పాటు పార్కును అద్భుతంగా సుందరీకరిస్తున్నట్లు వివరించారు. ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... లక్షలాది రూపాయల వ్యయంతో పద్మారావునగర్ పార్కును అందంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పార్కు సుందరీకరణ తర్వాత వీటి నిర్వాహణకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పనులు పూర్తి అయితే ఈ నెల 11న రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా పార్కును ప్రారంభిస్తామని పవన్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశన్, టి. వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, ముక్కా శ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిల రూ. 11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 23, పందిరిబీర 28, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 19, దోసకాయ 13, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 29, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వైద్యురాలికి ఆపిల్ వాచ్ అందజేత



వాచీని బాధితురాలి బంధువుకు అప్పగిస్తున్న డేవిడ్‌రాజు

సికింద్రాబాద్: రైలు బోగీలో విలువైన చేతి వాచిని మరిచిపోయి వెళ్లిన ఒక ప్రయాణికురాలికి జీఆర్‌పీ పోలీసులు తిరిగి అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... ఉస్మానియా ఆస్పత్రిలో దంతవైద్యురాలిగా పనిచేస్తున్న పూజాజైన్ భువనేశ్వర్ నుంచి గురువారం నగరానికి వచ్చి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగింది. తను ప్రయాణించిన ఏసీ బోగీలో రూ. 40 వేలు విలువ చేసే ఆపిల్ వాచ్ మరిచిపోయి వెళ్లింది. తాను వాచీని బోగీలో మరిచిపోయిన విషయాన్ని బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే స్టేషన్ నుంచి వెళ్లిపోయిన రైలులో తనిఖీలు చేయించిన రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు సదరు వాచ్‌ని తెప్పించి బాధితురాలి బంధువులకు అప్పగించారు.

ఓయూ విద్యార్థులకు ఉద్యోగాలు రావాలి: గంగవ్వ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు మరిన్ని ఉద్యోగాలు రావాలని తెలంగాణ గంగవ్వ ఆకాంక్షించారు. గురువారం ఓయూ క్యాంపస్‌కు విచ్చేసిన గంగవ్వ విద్యార్థులతో ఉద్యోగాల రాకపై ఆరా తీశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో వంద మందికి పైగా పోలీసు ఉద్యోగాలు వచ్చాయని విద్యార్థులు చెప్పడంతో ఆనందించిన ఆమె కష్టపడి చదివి మరిన్ని ఉద్యోగాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ఓలా, ఉబర్, ర్యాపిడ్ టూ వీలర్‌లను బంద్ చేయాలి

లాలాపేట: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ఓలా, ఉబర్, ర్యాపిడో టూ వీలర్‌లను పూర్తిగా బంద్ చేయాలనీ ఏఐటీయూసీ (ఆటో యూనియన్) స్టేట్ కౌన్సిల్ మెంబర్ బెజ్జాల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం తార్నాక చౌరస్తాలో స్థానిక ఆటో డ్రైవర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... నగరంలోని ఆటో స్టాండ్ వద్ద ఓలా, ఊబెర్ బైక్ వాలాలు తిష్టవేసి ఆటోలకు గిరాకి లేకుండా ఆటో కార్మికులకులకు ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజు, శ్యామ్, రమేష్, శ్రీనివాస్, రహమతుల్లా, శంకర్ తదితరులున్నారు.

సనత్‌నగర్ నియోజకవర్గ ఓటర్లు 2,44,946

సనత్‌నగర్: ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది జాబితాలో సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి 2,44,946 మంది ఓటర్లుగా నమోదయ్యారని ఈఆర్వో, డీఎంసీ శంకర్ వెల్లడించారు. ఇందులో 1,27,436 మంది మహిళలు, 1,17,502 మంది పురుషులు, మరో ఎనిమిది మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు. వీరితోపాటు 10 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మొత్తం 229 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారని వివరించారు.

హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి: ఓయూ చీఫ్ వార్డెన్


మెస్‌కార్డును అందచేస్తున్న చీఫ్ వార్డెన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని హాస్టల్ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. గురువారం వివిధ పీజీ కోర్సుల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మెస్ కార్డులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భోజనశాలకు మెస్‌కార్డుతోనే ప్రవేశించాలన్నారు. ప్రతి చిన్న సమస్యకు ఆందోళనలు చేయకుండ తన దృషికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

యూనివర్సిటీ చిత్రాన్ని ఆదరించండి: ఆర్.నారాయణమూర్తి


ఓయూ విద్యార్థులతో ఆర్.నారాయణమూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి ఉద్యమాల నేపథ్యంతో నిర్మించిన యూనివర్సిటీ చిత్రాన్ని ఆదరించాలని సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి విద్యార్థి నేతలను కోరారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవర్ణలో దళిత, వామపక్ష, విద్యార్థి జేఏసీల నాయకులతో ఆయన సమావేశమై వివిధ అంశాల పై చర్చించారు. వచ్చే నెల విడుదల కానున్న యూనివర్సిటీ చిత్రం ప్రీ రిలీజ్ ఈ నెల 9న ఎల్వీ ప్రసాద్ థియేటర్‌లో జరగనున్నట్లు తెలిపారు. ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు హాజరు కావాలని విద్యార్థి నేతలను కోరారు.

పియానో ప్లేయర్ సతీష్‌కు గౌరవ డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న సతీష్ కుమార్

కంటోన్మెంట్: వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన వరల్డ్ ఫాస్టెస్ట్ పియానో ప్లేయర్ డాక్టర్ టీఎస్ సతీష్ కుమార్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. సౌత్ ఆఫ్రికాలోని ఘనాకు చెందిన ప్రఖ్యాత విశ్వవిద్యాలయం వెబ్బిక్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ దక్కింది. ఆ యూనివర్సిటీ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఫిలిక్స్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ... సంగీత విభాగంలో ప్రఖ్యాత వెబ్బిక్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఎన్‌ఎస్‌హెచ్ 'స్వచ్ఛతా ర్యాలీ'



సనత్‌నగర్: స్వచ్ఛతపై అవగాహన కల్పించేలా నేషనల్ సార్టింగ్ హబ్ (ఎన్‌ఎస్‌హెచ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం 'స్వచ్ఛతా ర్యాలీ' నిర్వహించారు. బేగంపేట ఎయిర్‌పోర్టులోని ఎన్‌ఎస్‌హెచ్ నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరి ప్రధాన రహదారిలో పాంటలూన్స్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ మీదుగా తిరిగి ఎన్‌ఎస్‌హెచ్‌కు చేరుకుంది. హైదరాబాద్ సార్టింగ్ డివిజన్ ఆర్‌ఎంఎస్ సీనియర్ సూపరింటిండెంట్ సంతోషినేత జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 2023 సంవత్సరానికి గాను 'చెత్త రహిత భారతదేశం' అనే థీమ్‌తో 'స్వచ్ఛతా హి సేవా' ప్రచారానికి సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం కోసం ర్యాలీని చేపట్టామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు, సామాన్య ప్రజల్లో పరిశుభ్రతా స్ఫూర్తిని పెంపొందించడానికి ర్యాలీ కొనసాగించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నిరోధించడం, పౌరులందరిలో పర్యావరణ స్పృహను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బేగంపేట ఎస్ఐ గంగాధర్, నేషనల్ సార్టింగ్ హబ్ మేనేజర్ విద్యాసాగర్, పార్శిల్ ప్రాసెసింగ్ సెంటర్ ఆటోనగర్ ఇన్‌ఛార్జి శరత్‌కుమార్, కంప్యూటరైజ్డ్ రిజిస్ట్రేషన్ సార్టింగ్ సెంటర్ ఇన్‌చార్జి సుభానీ, బీఎన్‌పీఎల్ ఇన్‌ఛార్జి నర్మద, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్, సిబ్బంది పాల్గొన్నారు.